క్లుప్తంగా

21న గురుపౌర్ణమి


బాబా ఆలయం

కనిగిరి రూరల్: స్థానిక షిరిడీ సాయిబాబా దేవస్థానంలో ఈనెల 21న గురుపౌర్ణమి మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మరావు తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటలకు సామూహిక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం అన్న ప్రసాద వినియోగం, సాయంత్రం 6 గంటలకు పుష్పాభిషేకం, రాత్రి 7గంటలకు గుడి ఉత్సవాలు జరుగుతాయన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, ముంతాజ్ బేగం దంపతులు పాల్గొంటారన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న జీసీడీఓ మాధవీలత

వెలిగండ్ల: నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం కావాలని సమగ్రశిక్ష అధికారి సీహెచ్ మాధవీలత అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలను జీసీడీఓ మాధవీలత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ వచ్చే పది, ఇంటర్ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. పాఠశాల రికార్డులు, వంటశాల, భోజనాన్ని పరిశీలించారు. ప్రత్యేకాధికారి ఎస్. సుశీల, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

513 పొగాకు బేళ్లు కొనుగోలు


వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం చూర, ముక్క బేళ్లు 513 కొనుగోలయ్యాయి. పొందూరు, తుమాడు, జమ్ములపాలెం గ్రామాలకు చెందిన రైతులు 565 బేళ్లు వేలానికి తీసుకురాగా వాటిలో 513 కొనుగోలయ్యాయని వేలం నిర్వహణాధికారి తెలిపారు. వ్యాపారులు వివిధ కారణాలతో 52 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.139, కనిష్ట ధర రూ.60, సరాసరి ధర రూ.87.88 పలికింది. వేలంలో మొత్తం 18 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కనిగిరిలో స్వల్ప భూప్రకంపనలు

కనిగిరి రూరల్: కనిగిరి ప్రాంతంలో శుక్రవారం భూమి స్వల్పంగా కంపించింది. పట్టణంతో పాటు, మండలంలోని నందనమారెళ్ల ప్రాంతాల్లో ఉదయం 6 గంటల సమయంలో 5 సెకన్లు భూ ప్రకంపనలు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. దీంతో నందనమారెళ్ల గ్రామ వాసులు ఒక్క సారిగా భయాందోళనలతో పరుగులు తీశారు. కాగా శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు కనిగిరిలో చిరు జల్లులతో కూడిన ఎడతెరపిలేని వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పట్టణంలోని శివారు ప్రాంతాల్లోని రోడ్లు చిత్తడిగా మారాయి. మురుగు నీరు రోడ్డుపై రావడంతో ప్రజలు తీవ్ర దుర్గంధంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి


మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలను చైర్మన్ గఫార్ తనిఖీ చేసి, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. గఫార్ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పాఠశాలలో పరిశుభ్రతను పాటించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌ఓ ఏ.మల్లికార్జున తెలిపారు. శుక్రవారం సాయంత్రం అన్నెబోయినపల్లె వద్ద ఉన్న మన్నేరు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బంది వెళ్లారు. చీమలపెంట వద్ద ఇసుకలోడుతో వెళుతున్న ట్రాక్టర్లపై దాడిచేసి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ చెప్పారు.

‘మాకు సంబంధం లేదు’

- రెవెన్యూ పనులకు బ్రేక్
- ఎన్నికల బదిలీల్లో భాగంగా వచ్చిన తహసీల్దార్లకు జరగని స్థాన చలనం
- తమకేంటి సంబంధం అంటున్న అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు

ఉలవపాడు: ప్రతి వ్యక్తి జీవితానికి రెవెన్యూ వ్యవస్థ ముడిపడి ఉంటుంది. ఎక్కువ భాగం పనులు ఆ శాఖ ఆధ్వర్యంలో చేయాల్సిందే. కానీ రెవెన్యూ బదిలీలు ఆగిపోవడంతో ఎన్నో రకాల సేవలకు ఆటంకంగా మారింది. ఎన్నికల విధుల్లో భాగంగా తహసీల్దార్ల మార్పిడి జరిగింది. అయితే ఎన్నికలు ముగిశాయి కానీ.. నాడు పలు ప్రాంతాలకు బదిలీ అయిన తహసీల్దార్లు తమ సొంత ప్రాంతాలకు వెళ్లలేదు. అందుకే అన్ని కార్యాలయాల్లో ముఖ్యమైన పనులు, సంతకాలు చేసేవారు లేక జనం అవస్థలు పడుతున్నారు. వీరితో పాటు ఎంపీడీఓలు కూడా ఎన్నికల బదిలీలపై వచ్చి తిరిగి సొంత స్థలాలకు వెళ్లలేదు.

☛ రాజుపాలెం గ్రామానికి చెందిన ఓవ్యక్తి ఇటీవల పొలం కొనుగోలు చేశాడు. అయితే పాస్ బుక్ తన పేరుపై మార్చాలంటూ వీఆర్‌ఓను సంప్రదించాడు. కొత్త తహసీల్దార్ వచ్చిన తరువాతే రండి అని చెప్పడంతో ఏం చేయాలో తెలియక మెత్తబడిపోయాడు.

☛ మన్నేటికోట గ్రామానికి చెందిన ఓ మహిళ తన భర్తను ఇటీవలే పోగొట్టుకుంది. భర్త పేరుపై ఉన్న పొలం ఆమె పేరుపై ఆన్‌లైన్ చేయాలన్నా.. కొత్త తహసీల్దార్ రావాల్సిందే అన్న సమాధానం వచ్చింది.

ఏ పని కావాలని అడిగినా తాము త్వరలో వెళ్లిపోతామని.. మా తర్వాత వచ్చిన అధికారులతో చేయించుకోండంటూ తహసీల్దార్లు చెబుతున్నారు. ఇలా నెల రోజుల నుంచి పనులన్నీ పెండింగ్‌లో ఉండి పోయాయి. రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. రైతు వారీ ఏ పనులూ జరగడం లేదు. ఎన్నికల ఫలితాలు వచ్చి 45 రోజులు పైగా కావస్తున్నా సమస్య అలాగే ఉండిపోయింది.


ఉలవపాడు తహసీల్దార్ కార్యాలయం

పాస్ బుక్‌లకు దరఖాస్తులు, మ్యుటేషన్‌లు, సర్వేలు చేసి భూములు అప్పగించడం, పాస్‌బుక్‌లో పేర్లు మార్చడం, భర్త మరణిస్తే భార్యకు, తల్లిదండ్రులు మరణిస్తే బిడ్డల పేర్లపై భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లాంటి పనులను పట్టించుకొనేవారే కరువయ్యారు. కేవలం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలే అందిస్తున్నారు.

గతంలో ఎన్నికలు పూర్తయిన తరువాత వారం రోజుల్లోపు ఎవరి జిల్లాలకు వారిని తిరిగి పంపించేవారు. నేడు పరిస్థితి తిరోగమనంలా మారింది.

దాతల సాయం సద్వినియోగం చేసుకోండి


విద్యార్థులు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కందుకూరు: దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఈఓ ఎంవీవీ ప్రసాదరావు సూచించారు. వెంకటాద్రిపాలెం పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం దాతల సహకారంతో నోట్‌బుక్స్, ఎగ్జామ్ ప్యాడ్స్, వాటర్ బాటిల్స్, ఐరన్ టేబుల్, వాటర్ ప్యూరిఫైర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకునేందుకు పెద్ద ఎత్తున దాతలు ముందుకు వస్తున్నారని, విద్యార్థులకు విద్యా సామగ్రితో పాటు, పాఠశాలకు అవసరమైన వస్తువులను అందజేయడం అభినందనీయమన్నారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎం. నరసింహమూర్తి, సీఆర్పీ రమణారెడ్డి, యూటీఎఫ్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్, బీటీఏ నాయకులు పి. వెంకటేశ్వర్లు, గద్దగుంట వెంకటేశ్వర్లు, ఎ. వెంకటేశ్వర్లు, చిత్తారి వెంకటేశ్వర్లు, ఎస్.కె. అబ్దుల్లా, స్కూల్ హెడ్‌మాస్టర్ పద్మజ, ఉపాధ్యాయులు ఎస్ రాధ, దాతలు జి. మాల్యాద్రి, కె. రాజగోపాల్, సంధ్య, వేణు, మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఘన సన్మానం


విద్యార్థిని ప్రతిభను సన్మానిస్తున్న ఎంఈఓలు దేవిరెడ్డి రామిరెడ్డి, దాసుప్రసాద్

వెలిగండ్ల: పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీలో చదివి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం అభినందనీయమని ఎంఈఓలు దేవిరెడ్డి రామిరెడ్డి, దాసుప్రసాద్ అన్నారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో చదివిన జొన్నలగడ్డ ప్రతిభ ట్రిపుల్ ఐటీలో 568 మార్కులు సాధించి సీటు సాధించింది. శుక్రవారం విద్యార్థిని సన్మానించారు. ఎస్ఓ ఎస్. సుశీల, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొండపి(సింగరాయకొండ): మండల కేంద్రమైన కొండపి పంచాయతీ పరిధిలోని కేజీ కండ్రికలో పాక్షికంగా నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ బి.కిరణ్ కుమార్, ఎంపీడీఓ నాగమణి పరిశీలించారు. గురువారం కొండపి పర్యటనకు వచ్చిన కలెక్టర్ తమీమ్ అన్సారియా జాళ్లపాలెం వెళ్లే రోడ్‌లో చెత్త, వ్యర్థాలు చూసి వెంటనే వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. వ్యర్థాలను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో పాక్షికంగా నిర్మించిన కేంద్రాన్ని పరిశీలించామని, శనివారం స్థలాన్ని కొలిచి, ఆక్రమణల తొలగించి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆ స్థలాన్ని కొండపి ఎంపీడీఓ, పంచాయతీ అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ వేణు, నాగబ్రహ్మం, పూజిత తదితరులు పాల్గొన్నారు.

బోర్ వెల్ ఏర్పాటు


కాలనీలో ఏర్పాటు చేసిన బోర్ వద్ద ప్రజలు

కనిగిరి రూరల్: స్థానిక పొగాకు బోర్డు వెనుక వైపు గల దళిత, గిరిజన (గుజ్జుల యల్ల మందారెడ్డి) కాలనీలో నీటి వసతి కల్పన కోసం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ యాసీన్ కుమారుడు దివంగత సయ్యద్ మొహ్మద్ కైఫ్ జ్ఞాపకార్థం బోర్ వెల్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. పేద, దళిత, బలహీన వర్గాలు నివసించే కాలనీలో బోర్ వెల్ ఏర్పాటు చేయడాన్ని పలువురు కొనియడారు. త్వరలో స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో కాలనీలో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని సీపీఐ నాయకుడు సయ్యద్ యాసీన్ వెల్లడించారు. సీపీఐ నాయకులు వై. రవీంద్ర బాబు, జీపీ రామారావు, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి పండిటి మోహన్, ఏఐవైఎఫ్, ఎస్ ఎఫ్ నాయకులు పుట్టా సుబ్బారావు, పవన్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, ఖాశింవలి, బాషా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలగా సీఎస్‌పురం జెడ్పీ



పీఎంశ్రీ పాఠశాలకు ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓ, హెచ్ఎం

సీఎస్‌పురం (పామూరు): పీఎంశ్రీ పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి తెలిపారు. ఎంపీశ్రీ పాఠశాలగా ఎంపికైన సీఎస్ పురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. తాగునీరు, మరుగుదొడ్లు, పూర్తిస్థాయిలో ఫర్నిచర్, లేబరేటరీలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఆటస్థలం అభివృద్ధి, కెరీర్ గైడెన్స్, గంథాలయం వంటి సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాలు ఉండేలా చూసుకోవాలని, నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని కుకింగ్ ఏజన్సీ నిర్వాహకులకు సూచించారు. హెచ్ఎం షేక్ ఖాదరున్నీసాబేగం, సీఆర్‌పీ వి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు


విద్యార్థులకు నోట్‌బుక్స్, విద్యాసామగ్రి అందజేస్తున్న హెచ్‌యం, దాతలు

సీఎస్‌పురం (పామూరు): అన్ని వసతులతో ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్ స్కూళ్లకు పోటీ ఇస్తున్నాయని హెచ్ఎం జి.రామకృష్ణ అన్నారు. రెడ్డిగారికొత్తపల్లె ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం గ్రామానికి చెందిన దాతలు చల్లా మనోజ్, చల్లా మధు సమకూర్చిన నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, జామెంట్రీ, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు గూడల హరిబాబు, జె.ఐశ్వర్య, టి.హెప్సిబా, నాయకులు కాకు చెంగాలయ్య, కడప శ్రీనివాసులు, గోవిందమ్మ, కాకు సుబ్బారావు, నాలి రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

మార్కాపురం మండల అభివృద్ధికి కృషి

- ఎంపీపీ బండి లక్ష్మిదేవి


మాట్లాడుతున్న ఎంపీపీ బండి లక్ష్మిదేవి, పక్కన జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, ఎంపీడీఓ చందన

మార్కాపురం రూరల్: మార్కాపురం మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ బండి లక్ష్మిదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంపీటీసీ సభ్యులు తమ పరిధిలో సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రాధాన్యతా క్రమంలో వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. తాగునీరు, విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని పలువురు ఎంపీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంపీపీతోపాటు ఎంపీడీఓ తోట చందన స్పందిస్తూ.. ఆయా సమస్యలు పరిష్కరించేందుకు దృష్టి సారిస్తామన్నారు. అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, వేములకోట ఎంపీటీసీ సభ్యుడు వీరయ్య, ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ మోహన్‌రెడ్డి, అధికారులు మోహన్‌రాజు, జీవరత్నం, చందు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంతో ప్రాణాలకు రక్ష

కొనకనమిట్ల: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడి తమ జీవితానికి భద్రత కల్పించుకోవాలని ఎస్సై కె.మాధవరావు సూచించారు. శుక్రవారం సాయంత్రం కొనకనమిట్ల సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. హెల్మెట్ వినియోగంతో కలిగే ఉపయోగాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

ఘనంగా కేవీకే స్వర్ణోత్సవాలు


కేవీకే స్వర్ణోత్సవాల్లో శాస్త్రవేత్తలు, మహిళా రైతులు

కందుకూరు: కృషి విజ్ఞాన కేంద్రాలు ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఓవీ రోడ్డులోని కృషి విజ్ఞాన కేంద్రంలో స్వర్ణోత్సవాలను శుక్రారం నిర్వహించారు. కేవీకే హెడ్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి. ప్రసాద్‌బాబు మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి కేవీకేని 1974లో పుదుచ్చేరిలో ప్రారంభించి నేటికి 50 ఏళ్లు పూర్తయ్యాయన్నారు. 1974లో ఒక కేవీకేతో ప్రారంభించి.. ప్రస్తుతం దేశంలో 740 కేవీకేలు ఉన్నాయని, 10 కోట్ల మంది రైతులకు సలహాలు, సూచనలు ఇస్తూ రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. కందుకూరు కేవీకే కూడా గత 10 ఏళ్లలో అనేక మంది రైతులు, రైతు మహిళలకు నూతన వంగడాలు, నర్సరీ మొక్కలు, యంత్ర పరికరాలు సమకూర్చి ఆదాయాన్ని పెంచిందని తెలిపారు. నేల సారవంతం కావాలంటే జనుము లేదా జీలుగ విత్తనాలను విత్తుకుని పూత దశలో భూమిలో కలియదున్నాలని సూచించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ జ్యోతి, శ్రీరంగ, మయాంక్, వివేక్, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలు పేదలకు వరం


పామూరు కేజీబీవీలో మాట్లాడుతున్న జీసీడీఓ మాధవీలత


సీఎస్‌పురంలో మాట్లాడుతున్న జీసీడీఓ మాధవీలత

పామూరు: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు పేద విద్యార్థులకు వరంలాంటివని జీసీడీఓ సీహెచ్ మాధవీలత పేర్కొన్నారు. స్థానిక కేజీబీవీ విద్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పది వార్షిక పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు వచ్చేలా చూడాలని ఎస్ఓ కటకం సజనకు సూచించారు. ఏఓ వాణి, ఉపాధ్యాయినులున్నారు.

నూరుశాతం ఫలితాల సాధనే ధ్యేయం

సీఎస్‌పురం (పామూరు): కేజీబీవీలో చదివే 10, ఇంటర్ విద్యార్థినులు నూరుశాతం ఫలితాలు సాధించాలని జీసీడీఓ సీహెచ్ మాధవీలత అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాల, విద్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి పాఠశాలలో సమస్యలు, పరిష్కరించాల్సిన అంశాలపై సూచనలు ఇచ్చారు. ఎస్ఓ రేష్మ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

సాగు హక్కు పత్రాలతో భరోసా


హనుమంతునిపాడు: కొండారెడ్డిపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్


లింగసముద్రం: రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

లింగసముద్రం: అర్హత కలిగిన ప్రతి కౌలు రైతుకు పంట సాగు హక్కు పత్రాలను అందిస్తామని మండల వ్యవసాయాధికారి టి.అబ్రహంలింకన్ పేర్కొన్నారు. శుక్రవారం యర్రారెడ్డిపాలెం, లింగసముద్రం-1 రైతు సేవాకేంద్రాల్లో సీసీఆర్ కార్డులపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీసీఆర్ కార్డులపై అవగాహన పెంచుకుని కౌలు రైతులకు కార్డులు అందజేసేందుకు సహకరించాలని కోరారు. కవీఏఏ సుధీర్‌కుమార్, వీఆర్వో సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: కౌలు కార్డులు కౌలు రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటాయని తహసీల్దార్ కె. కిషోర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొండారెడ్డిపల్లి, నందనవనం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. వీటివల్ల భూ యజమానులకు ఎటువంటి నష్టం వాటిల్లదన్నారు. కౌలు కార్డు పరిమితి 11 నెలలు ఉంటుందని చెప్పారు. సర్పంచ్ దేవకరుణమ్మ, ఏఓ గోపీక్రిష్ణ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం: పెదపవని ఎస్టీ కాలనీలో ఆధార్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఇటీవల కాలనీ వాసులు సమస్యను ఎమ్మెల్యేకి చెప్పడంతో కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరితో మాట్లాడి ఎస్టీ కాలనీలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. జనన ధ్రువీకరణ పత్రం లేనివారి నుంచి అర్జీలు స్వీకరించి వారికి త్వరలో ఆధార్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, నాయకులు గొర్రెపాటి సాంబయ్య, షేక్ నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ వాడకం తగ్గించి పుస్తక పఠనం పెంచాలి


మాట్లాడుతున్న రచయిత విశ్వనాథ్

యర్రగొండపాలెం: సెల్‌ఫోన్‌ను తలవంచుకుని చూస్తే సమాజంలో కూడా తలవంచుకోవాల్సిందేనని, కానీ, తలవంచి పుస్తక పఠనం చేస్తే సమాజంలో తలెత్తుకునే విధంగా ఎదుగుతారని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రముఖ కవి దేవులపల్లి విశ్వనాథ్ రచించిన కవితా మంజూష గ్రంథ ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవరచుకోవాలని, నిత్యం గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. రచయిత విశ్వనాథ్ మాట్లాడుతూ కవులు ముందు యుగపు దూతలని, వారు గతం, భవిష్యత్తుకు వారధులని, వారిని గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. విద్యార్థులు గొప్ప జ్ఞాన సంపన్నులని, ఉన్నత విద్యనభ్యసించి తమ తల్లిదండ్రులు, గురువులు, పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు. అనంతరం పాఠశాల పూర్వ విద్యార్థి వెంకటస్వామి గ్రంథాన్ని ఆవిష్కరించారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన, పాఠశాల మెరిట్ విద్యార్థులకు రచయిత, ఆవిష్కరణ కర్తలు ఒక్కొక్కరికి రూ.1116 చొప్పున అందించి ప్రోత్సహించారు. అనంతరం వారిని ఎంఈవో, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 మల్లునాయక్, హెచ్ఎం కె.రమాదేవి, ఉపాధ్యాయులు రజని, ఖయ్యూంబాష, మంత్రూనాయక్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

70.2 మి.మీ వర్షపాతం

కనిగిరి రూరల్: కనిగిరి రెవెన్యూ డివిజన్‌లోని 13 మండలాల్లో 70.2 మి.మీల వర్షపాతం నమోదు కాగా, సరాసరి 5.4 మి.మీల వర్షపాతం నమోదు అయినట్లు శుక్రవారం అధికారులు వెల్లడించారు. కనిగిరి మండలంలో 10.6 మి.మీ, వెలిగండ్లలో 12.0 మి.మీ, హెచ్‌ఎంపాడులో 16.0 మి.మీ, పామూరులో 8.2 మి.మీ, పీసీపల్లిలో 7.8 మి.మీ, సీఎస్‌పురంలో 3.4మి.మీ వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.

అన్నప్రసాదానికి రూ.1.50 లక్షల విరాళం


విరాళం చెక్కు అందజేస్తున్న దాత ఇందిరాదత్తు

పామూరు: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈనెల 21వ తేదీ గురుపౌర్ణమి సందర్భంగా అన్న ప్రసాదంకోసం కేసీపీ సిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి వీఎల్ ఇందిరా దత్తు రూ.1.50 లక్షల విరాళం ప్రకటించారు. ఆ చెక్కును సాయిబాబా ఆలయ చైర్మన్ పబ్బతి వెంకట సుబ్బయ్యకు కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.